‘నిజాం’గానే తెరుచుకునేనా?

# ఆశలు శిథిలం



- తుప్పుపట్టిన ఎన్‌ఎస్‌ఎఫ్..
- పాడయిన యంత్రాలు, బాయిలర్లు
- చోరీకి గురైన మిషన్లు, కబ్జాకు గురైన భూములు
- సెప్టెంబర్ 17లోగా పునరుద్ధరిస్తామన్న సర్కారు
- ఫ్యాక్టరీ స్థితిగతులపై ఫోకస్ చేయని వైనం
- రన్నింగ్‌లో ఉన్నప్పుడే ఓవర్ ఆయిలింగ్‌కు ఆర్నెళ్ల సమయం
- ఇప్పుడు మరమ్మతులు చేపట్టాలంటే ఎన్నేళ్లో..
- సమగ్ర కార్యాచరణ లేకుండానే తెరవడం సాధ్యమా?
- ఓట్ల కోసమే మళ్లీ పునరుద్ధరణ అంటున్న కాంగ్రెస్

**నిజాం షుగర్స్** ఫ్యాక్టరీ (ఎన్‌ఎస్‌ఎఫ్) పునరుద్ధరణపై కాంగ్రెస్ సర్కారు చేసిన ప్రకటన అనేక అనుమానాలకు తావిస్తున్నది. ఫ్యాక్టరీలోని మెషినరీ స్థితిగతులను పరిశీలించకుండానే తెరిపిస్తామనడం కార్మికులు, రైతులను అయోమయానికి గురి చేస్తున్నది. సెప్టెంబర్ 17లోపు నిజాం షుగర్స్‌ను పునరుద్ధరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల నిజామాబాద్ బహిరంగ సభలో ప్రకటించారు. తాజాగా కొన్ని నిధులు కూడా విడుదల చేశారు. అయితే, లేఆఫ్ కారణంగా ఎనిమిదేండ్ల క్రితం మూతబడిన ఫ్యాక్టరీ పూర్తిగా పిచ్చిమొక్కలు, ముళ్ల చెట్లతో నిండిపోయింది. మెషినరీ, బాయిలర్లు, విలువైన పరికరాలు తుప్పుపట్టాయి. ఫ్యాక్టరీలోని మిల్‌హౌస్, ఇతర యంత్రాల వద్దకు వెళ్లేందుకు వీలులేని పరిస్థితి నెలకొన్నది. మిషినరీ స్థితిగతుల పరిశీలన, ఫ్యాక్టరీ పునరుద్ధరణకు నిపుణుల కమిటీని వేయలేదు. చెరుకు సాగువైపు రైతులను ప్రోత్సహించే కార్యాచరణ లేదు. సమగ్ర ప్రణాళిక లేకుండానే, యంత్రాలు పని చేస్తాయో లేదో పరిశీలించకుండానే సీఎం ప్రకటన చేయడం విస్మయానికి గురి చేస్తున్నది. లోక్‌సభ ఎన్నికల్లో ఓట్ల కోసమే మళ్లీ పునరుద్ధరణ అంశాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు తీసుకొచ్చిందని రైతులు, కార్మికులు మండిపడుతున్నారు.

–బోధన్, మే 3

**బోధన్‌లోని** చక్కెర కర్మాగారం దేశంలోనే ప్రభుత్వరంగంలో ఏర్పడిన తొలి చక్కెర ఫ్యాక్టరీ. ఈ ఫ్యాక్టరీ లాభాలతో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏడు చక్కెర కార్మాగారాల నిర్మాణం జరిగింది. శక్కర్‌నగర్, కామారెడ్డి, ఆంధ్రప్రదేశ్‌లోని చాగల్లులో ఆల్కాహాల్ డిస్టిల్లరీలను నిజాం షుగర్స్ నడిపేది. నాగార్జున్‌సాగర్‌లో మెషినరీ డివిజన్ ఉండేది. ఆసియాలోనే అతిపెద్ద కర్మాగారంగా పేరొందిన నిజాం షుగర్స్‌ను ఆంధ్ర పాలకులు భ్రష్టు పట్టించారు. ఉమ్మడి రాష్ట్రంలోని మిగతా చక్కెర ఫ్యాక్టరీలన్నీ అమ్ముడుపోగా, 2000 నాటికి బోధన్ శక్కర్‌నగర్, జగిత్యాల జిల్లా ముత్యంపేట్, మెదక్ జిల్లా ముంబోజిపల్లి చక్కెర ఫ్యాక్టరీలు మాత్రమే మిగిలాయి. 2002 వరకు కూడా లాభాలను ఆర్జిస్తున్న ఆయా కర్మాగారాలతో పాటు శక్కర్‌నగర్‌లోనే ఉన్న ఆల్కహాల్ డిస్టిల్లరీని అప్పటి సీఎం చంద్రబాబు.. డెల్టా పేపర్ మిల్స్‌కు జాయింట్ వెంచర్ పేరిట అప్పగించాడు. ప్రైవేట్ యాజమాన్యం ఫ్యాక్టరీ సొమ్మును అమ్ముకుని అందిన కాడికి దోచుకున్నది. చివరకు ఫ్యాక్టరీని నడుపలేమంటూ ఎనిమిదేళ్ల క్రితం లేఆఫ్ ప్రకటించి మూసివేసింది. దీంతో బోధన్‌లో సుమారు 15 వేల ఎకరాల వ్యవసాయ భూముల్లో చెరుకు సాగు నిలిచిపోయింది. నిజాం షుగర్స్‌కు అనుబంధంగా ఉన్న దాణా ఫ్యాక్టరీ, సోడాగ్యాస్ యూనిట్, చిన్న పరిశ్రమలు మూతపడ్డాయి.



తుప్పు పట్టిన యంత్రాలు,



పిచ్చి మొక్కలతో బూత్‌బంగ్లాను తలపిస్తున్న ఫ్యాక్టరీ భవనం



## పునరుద్ధరణ సాధ్యమయ్యేనా?

వాస్తవానికి ఫ్యాక్టరీ రన్నింగ్ కండిషన్‌లో ఉన్నప్పుడే అనేక నిర్వహణ క్రతువులు ఉంటాయి. అలాంటిది ఎనిమిదేండ్లుగా ఎలాంటి నిర్వహణ లేకుండా పడి ఉన్న యంత్రాలు పని చేస్తాయా? అన్నది అనుమానాస్పదంగా మారింది. వాస్తవానికి క్రషింగ్ సీజన్ పూర్తయిన తర్వాత.. వచ్చే సీజన్ కోసం ఏటా ‘ఓవర్ ఆయిలింగ్’ చేస్తుంటారు. ఈ ప్రక్రియ ఆర్నెళ్ల పాటు కొనసాగుతుంది. ఓవర్ ఆయిలింగ్‌కు ఒక్కోసారి రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు ఖర్చు అవుతుంటుంది. రన్నింగ్ కండిషన్‌లో ఉన్న ఫ్యాక్టరీ ఓవర్ ఆయిలింగ్ కోసమే ఇంత తతంగం ఉంటే, ఎనిమిదేండ్లు నిరుపయోగంగా ఉన్న ఫ్యాక్టరీని నడపాలంటే ఎంతో అకుంఠిత దీక్ష, సమగ్ర కార్యాచరణ, నిధుల కేటాయింపు అవసరం. ఇక, ఆయిలింగ్ కోసమే ఆర్నెళ్లు పడితే.. రన్నింగ్‌లో లేని మిషన్ల మరమ్మతులకు ఎంతకాలం పడుతుందో తెలియదు. ఇందుకోసం అప్పట్లో ఏటా రూ.2 –3 కోట్లు ఖర్చు అయినప్పుడు.. పాడయిన యంత్రాలతో కూడిన ఫ్యాక్టరీని గాడిలో పెట్టాలంటే ఎన్ని కోట్లు కావాలో లెక్కేయాలి. కానీ, రేవంత్ ప్రభుత్వం ఎలాంటి ప్రణాళిక, ఫ్యాక్టరీలో మెషినరీ పరిశీలన చేపట్టకుండానే పునరుద్ధరణ ప్రకటన చేసింది. యంత్రాలు ఏ స్థితిలో ఉన్నాయి.. కొత్తగా ఏయే యంత్రాలను తెప్పించాలో తెలుసుకోకుండానే పునరుద్ధరణ అంటూ కాంగ్రెస్ పాలకులు చేస్తున్న హడావుడి చూస్తుంటే.. ఎన్నికల్లో లబ్ధి కోసమే ఇదంతా అన్న అనుమానం కలుగుతున్నది. నిపుణుల కమిటీ నియామకం లేకుండా, ఫ్యాక్టరీ మరమ్మతు పనుల కోసం రూపాయి కేటాయించకుండా ‘పునరుద్ధరణ’ ఎలా జరుగుతుందో అర్థం కావడం లేదని కార్మికులు పేర్కొంటున్నారు.

### శిథిలావస్థకు చేరిన మెషినరీ

ఎనిమిదేండ్ల నుంచి వినియోగంలో లేకపోవడంతో ఫ్యాక్టరీలోని యంత్రాలు పాడైపోయాయి. బాయిలర్స్ ట్యూబ్‌లు, జ్యూస్ హీటర్స్, జ్యూస్ ప్యాన్‌లు, క్రిస్టల్ లైనర్స్, సల్ఫేట్ హౌస్, సున్నం మిల్లు తదితర యంత్రాలు దెబ్బతిన్నాయని కార్మికులు చెబుతున్నారు. మిల్‌హౌస్ పూర్తిగా అస్తవ్యస్తంగా తయారైంది. వాటర్ కూలింగ్ ప్లాంట్ దెబ్బతిన్నట్లు కనిపిస్తున్నది. ఫ్యాక్టరీ పైకప్పు మొత్తం శిథిలావస్థకు చేరింది. వందలాది ఎకరాల భూములు కబ్జాకు గురయ్యాయి. చిన్నసైజు మోటార్లు, పరికరాలు, స్క్రాప్ ఈ ఎనిమిదేండ్లలో టన్నుల కొద్దీ చోరీకి గురయ్యాయి. దీనిపై ఫ్యాక్టరీ యాజమాన్యం గతంలో చాలా సార్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పిచ్చిమొక్కలతో నిండిపోయిన కర్మాగారాన్ని తెరిపించాలంటే సమగ్ర కార్యాచరణ అవసరం. కానీ అదేదీ లేకుండానే రేవంత్ ప్రకటన చేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### ఓట్ల కోసమే పునరుద్ధరణ..

నిజాం షుగర్ ఫ్యాక్టరీని తిరిగి ప్రారంభిస్తామనడం సంతోషకరం. అయితే, నిజాం షుగర్స్‌ను ఏవిధంగా తెరిపిస్తారన్న విషయం అర్థంకావడం లేదు. ఫ్యాక్టరీలోని యంత్రాలు ఎనిమిదేండ్లుగా పని చేయకపోవడంతో పాడయిపోయి ఉంటాయి. ఆ యంత్రాల పరిస్థితిని ఇప్పటికీ పరిశీలించలేదు. ఇంజినీర్లు, అధికారులను నియమించి మెషినరీపై స్టడీ చేయాలి. సెప్టెంబర్ 17న ప్రారంభిస్తామని రేవంత్‌రెడ్డి చెబుతున్నారు. ఇప్పటివరకు నిపుణుల బృందం యంత్రాలను పరిశీలించలేదు. చెరుకు సాగు కోసం చర్యలు తీసుకోలేదు. ఎన్నికల కోసమే పునరుద్ధరణ అంటున్నారా అన్న అనుమానం కలుగుతున్నది. ఫ్యాక్టరీని నడిపించాలన్న చిత్తశుద్ధి ఉంటే వెంటనే యంత్రాల మరమ్మతులు చేపట్టాలి.



- రవిశంకర్‌గౌడ్, ఎన్‌ఎస్‌ఎఫ్ కార్మిక నాయకుడు, బోధన్

షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ

# ఎన్నికల స్టంటే..

- రైతులను మభ్యపెట్టేందుకే బకాయిల విడుదల
- ఫ్యాక్టరీ భూములను కబ్జా చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి యత్నం
- ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆరోపణ

వినాయకనగర్, మే 3: నిజాంషుగర్ ఫ్యాక్టరీలు తెరిపిస్తామని కాంగ్రెస్ చెప్పడం కేవలం ఎన్నికల స్టంటేనని ఎంపీ అర్వింద్ విమర్శించారు. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తాతో కలిసి ఆయన శుక్రవారం బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఫ్యాక్టరీ తెరవాలంటే రూ.800 కోట్లు అవసరమని, కానీ కాంగ్రెస్ సర్కారు కేవలం రూ.42 కోట్లు విడుదల చేయడం రైతులను మభ్యపెట్టేందుకేనని తెలిపారు. ఎన్నికల్లో ఓట్ల కోసమే మరో కొత్త నాటకానికి తెర లేపారన్నారు. పని చేయని మెషిన్లను ఫ్యాక్టరీ నుంచి మరోచోటుకు తరలించి, ఎన్‌ఎస్‌ఎఫ్ భూములను కబ్జా చేసేందుకు రియల్ ఎస్టేట్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు.

# వాగ్దానాలతో వంచించిన కాంగ్రెస్

- ప్రజలను మోసం చేసిన రేవంత్ సర్కార్
- ఇచ్చిన హామీలను ఎగ్గొట్టే యత్నం..
- దేవుడి పేరు మీద ఓట్లడిగే వారికి బుద్ధి చెప్పండి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి
- బాల్కొండ, వేల్పూర్, భీమ్‌గల్ మండలాల్లో ప్రచారం



ఎన్నికల ప్రచారంలో భాగంగా భీమ్‌గల్ మండలం బాబాపూర్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



బాల్కొండ/వేల్పూర్/భీమ్‌గల్, మే 3: అసెంబ్లీ ఎన్నికల్లో అబద్ధపు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసిందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఎగ్గొట్టేందుకు యత్నిస్తున్నదని ఆరోపించారు. బాల్కొండ మండలంలోని జలాల్‌పూర్, నాగపూర్, వేల్పూర్ మండలం రామన్నపేట్, భీమ్‌గల్ మండలం బాబాపూర్ గ్రామంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేముల మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వం మారిందని, దీంతో మళ్లీ ప్రజలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేసిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో 50 ఏండ్లలో జరగని అభివృద్ధి పదేండ్లలో చేసి చూపించిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అలవికాని హామీలిచ్చి వందరోజుల్లో అమలుచేస్తామని చెప్పిందని గుర్తుచేశారు. ఆ హామీల అమలుపై ఇప్పటివరకు స్పందన లేదని, అడిగితే ఆగస్టు 15లోగా అమలుచేస్తామని చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పార్టీ హామీలతో మహిళలు, రైతులు, యువతను నమ్మించి మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి ఏనాడూ మన మంచి చెడులకు రాలేదని, ఎమ్మెల్సీగా ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన పనులను కాంగ్రెస్ సర్కార్ నిలిపివేయడానికి యత్నిస్తోందని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో హస్తం పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

### పసుపు ధర పెంపులో అర్వింద్ కృషిలేదు..

ఎంపీ అర్వింద్ ఐదేండ్లయినా పసుపు బోర్డు తీసుకురాలేదన్నారు. పంట సాగు తగ్గి పసుపు ధర పెరిగిందని, ఇందులో అర్వింద్ చేసిన కృషి ఏమీలేదన్నారు. గెలిపించిన ప్రజలకు ఏమీ చేయకుండా రాముడు, మోదీ పేరుమీద ఓట్లు అడుగుతున్న వారికి కర్రు కాల్చివాత పెట్టాలని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ ప్రజల మనిషి అని అన్నారు. ప్రజల పక్షాన పోరాడడానికి ఆయనను ఆశీర్వదించి, భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్, బీజేపీకి కర్రుకాల్చి వాత పెట్టాలి



ఇందల్వాయి మండలం సిర్నాపల్లిలో మాట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్, పక్కన రాజ్యసభ సభ్యుడు సురేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్

- హామీలను తుంగలోకి తొక్కిన రేవంత్ సర్కార్
- ఆగస్టు 15 రుణమాఫీ ఏ సంవత్సరమో చెప్పాలి
- ఎంపీ అర్వింద్ తెస్తానన్న పసుపు బోర్డు ఎక్కడ ?
- బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ ఆగ్రహం
- ఇందల్వాయి మండలంలో ఎన్నికల ప్రచారం

ఇందల్వాయి, మే 3 : ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైన కాంగ్రెస్, బీజేపీలకు లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు కర్రుకాల్చి వాత పెట్టాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన ఇందల్వాయి మండలంలోని గన్నారం, మెగ్యానాయక్ తండా, స్టేషన్ తండా, సిర్నాపల్లి, నల్లవెల్లి, ఎల్లారెడ్డిపల్లి గ్రామాల్లో రాజ్యసభ సభ్యుడు సురేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి మాట్లాడుతూ..గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు, రూ. 4వేల పింఛన్, రైతుబంధు రూ.15 వేలు, యువతకు ఎలక్ట్రిక్ స్కూటీలు, మహిళలకు రూ.2,500 పథకాలను వందరోజుల్లో అమలుచేస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చి నాలుగునెలలవుతున్నా వాటిని అమలుచేయడంలేదని, గ్రామాలకు వచ్చే కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. జవాబు చెప్పలేక తిరిగి పారిపోతారని ఎద్దేవా చేశారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు బీడీ కార్మికులకు పెన్షన్, రైతుబంధు, రైతుబీమా, సీఎంఆర్‌ఎఫ్ ఇచ్చిందా అని ప్రశ్నించారు. ఏ ఒక్క పథకాన్ని అమలుచేసే దమ్ములేదు, కానీ మాటలు మాత్రం కోటలు దాటుతున్నాయని మండిపడ్డారు.

### ప్రజలు, రైతులను మోసం చేసిన అర్వింద్

గత లోక్‌సభ ఎన్నికల్లో అర్వింద్ గెలిచిన ఐదురోజుల్లో పసుపుబోర్డు తెస్తానని, షుగర్ ఫ్యాక్టరీ తెరిపిస్తానని అబద్ధాలు చెప్పి ప్రజలు, రైతులను మోసం చేశాడని విమర్శించారు. మోదీ ఇస్తానన్న రూ.15 లక్షలు, రెండు కోట్ల ఉద్యోగాలు ఎక్కడ అని బీజేపీ నాయకులను ప్రశ్నించారు. అబద్ధాలతో ప్రజలను మభ్యపెడుతున్న కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెప్పాలన్నారు. తాను గెలిస్తే గల్ఫ్ కార్మికుల కోసం గల్ఫ్ పాలసీతోపాటు పసుపు బోర్డును తీసుకువస్తానన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి తనను ఆశీర్వదించాలని ప్రజలను కోరారు.

### నాలుగు నెలలైనా అందని సంక్షేమ పథకాలు

**రాజ్యసభ సభ్యుడు సురేశ్‌రెడ్డి**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు దాటినా ప్రజలకు ఎలాంటి సంక్షేమ పథకాలు అందడంలేదని రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్‌రెడ్డి అన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. కేసీఆర్ పాలనలోనే ప్రతి ఒక్కరికీ పక్కాగా సంక్షేమ పథకాలు అందాయని గుర్తుచేశారు. కారు గుర్తుకు ఓటు వేసి బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో ఎంపీపీ రమేశ్ నాయక్, జడ్పీటీసీ సుమనారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు దాసు, జాయింట్ సెక్రటరీ పులి శ్రీనివాస్, ఎంపీటీసీలు లావణ్య, సుధీర్, బాబురావు, సీహెచ్.దాసు, శ్రీను, సుధాకర్, క్రాంతి, అంబర్‌సింగ్, బీరేశ్, సాంబారు శ్రీకాంత్, బీఆర్‌ఎస్ అన్ని అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## వరి కొయ్యలకు నిప్పపెట్టబోయి మృత్యువాత

- ప్రమాదవశాత్తు నిప్పంటుకొని రైతు దుర్మరణం
- సిరికొండ మండలం పెద్దవాల్గోట్‌లో ఘటన

సిరికొండ, ఏప్రిల్ 3: వరి కొయ్యలకు నిప్పుపెట్టబోయి ఓ రైతు ప్రమాదవశాత్తు మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన సిరికొండ మండలం పెద్దవాల్గోట్ గ్రామంలో చోటుచేసుకున్నది. ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లాయిడి కిషన్(45) పోత్నూర్ గ్రామ శివారులో ఉన్న తన వ్యవసాయ భూమిలో వరి కొయ్యలకు నిప్పు పెట్టడానికి గురువారం సాయంత్రం వెళ్లాడు. వరి కొయ్యలకు నిప్పుపెడుతుండగా ప్రమాదవశాత్తు కిషన్‌కు మంటలు అంటుకోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రాత్రియినా ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు శుక్రవారం ఉదయం వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి చూడగా కిషన్ మృతదేహం కనిపించింది. కిషన్ భార్య లాయిడి లత ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని శవ పంచనామా కోసం మృతదేహాన్ని ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి కుమారు కౌశిక్, కూతురు హర్షిణి ఉన్నారని పేర్కొన్నారు.





జిల్లా కేంద్రంలో ఇంటి నుంచే ఓటు హక్కును వినియోగించుకుంటున్న వృద్ధులు

# ‘ఇంటి నుంచి ఓటు’ ప్రారంభం

- ఓటేసిన వృద్ధులు, దివ్యాంగులు..
- మొదలైన లోక్‌సభ ఎన్నికల పోలింగ్

కంఠేశ్వర్, మే 3: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ ప్రారంభమైంది. ఇంటి నుంచి ఓటు వేసే ప్రక్రియ శుక్రవారం ఆరంభమైంది. వృద్ధులు, దివ్యాంగులు పోలింగ్ కేంద్రాలకు వెళ్లే అవసరం లేకుండా, ఇంటి నుంచే ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించింది. దీంతో 85 ఏండ్ల పైబడిన వయోవృద్ధులు, వికలాంగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పటిష్ట బందోబస్తుతోపాటు వీడియో చిత్రీకరణ నడుమ హోమ్ ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమైందని, ఈ నెల 6వ తేదీ వరకు కొనసాగుతుందని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. ఇంటి నుంచి ఓటు సేకరించే ప్రక్రియను కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ పకడ్బందీగా నిర్వహిస్తున్నామని చెప్పారు. తొలిరోజు పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజక వర్గాల్లో ఎన్నికల బృందాలు ఆయా రూట్ల వారీగా తమకు నిర్దేశించిన ఓటర్ల ఇళ్లకు వెళ్లి వారి ఓటును సేకరించాయని తెలిపారు. ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా గోప్యతను పాటిస్తూ వీడియో చిత్రీకరణ నడుమ హోమ్ ఓటింగ్ కొనసాగుతున్నదని వివరించారు. హోమ్ ఓటింగ్‌కు సంబంధించిన సమాచారాన్ని అభ్యర్థులతో పాటు రాజకీయ పార్టీల ప్రతినిధులకు ముందస్తుగానే తెలియజేయడంతో వారు కూడా పరిశీలిస్తున్నారన్నారు.